క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రతిజ్ఞ

జి.సిగడాం: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ అన్నారు. మండలంలోని వెలగాడ, దేవరవలస గ్రామాల ప్రజలకు బుధవారం వైద్య సేవలను అందించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. సూపర్‌వైజర్ సుగణకుమారి, ఏఎన్ఎం కృష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారుడికి అభినందన



శివచరణ్‌ను అభినందిస్తున్న కళాశాల అధికారులు, యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎండ శివచరణ్ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని కళాశాలలో బుధవారం యాజమాన్య ప్రతినిధి సాయినాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు. సీఎస్ఈ బ్రాంచ్ తృతీయ ఏడాది చదువుతున్న విద్యార్థి ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన అండర్-20లో 72 కిలోల గ్రీకోరామన్ విభాగంలో రజిత పతకం సాధించాడు. రాజస్థాన్‌లోని కోటాలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనున్నాడు.

విద్యుత్ అధికారుల పరిశీలన



కుమ్మరిపేటలో పరిశీలన చేస్తున్న దృశ్యం

గార: మండల కేంద్రంలోని కుమ్మరిపేటలో కరెంట్ కష్టాలపై విద్యుత్ అధికారులు బుధవారం పరిశీలన చేశారు. 'కుమ్మరిపేట కరెంట్ కష్టాలు' శీర్షికతో సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో విద్యుత్ ఏఈఈ కమలహాసన్, లైన్‌మెన్ సనపల గోపిలు పరిశీలన చేశారు. పొలాల్లో గతంలో ఉన్న విద్యుత్ స్తంభానికి మినీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించడం వలనే సమస్య పెరిగిందని గుర్తించారు. వినియోగదారులతో విద్యుత్ సరఫరా సమస్యలపై మాట్లాడారు. మూడు రోజుల్లో సమస్యను పరిష్కారిస్తామని సర్పంచ్ మార్పు దుర్గా పృథ్వీరాజ్, ఎంపీటీసీ ఆరంగి రమణమూర్తిలకు విద్యుత్ సిబ్బంది తెలియజేశారు.

దంతాల పరిశుభ్రతతో ఆరోగ్యం

గార: దంతాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు అన్నారు. మండలంలో దీపావళి జంక్షన్ సమీపంలోని సాందీపని విద్యాలయంలో లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం బుధవారం ప్రారంభించారు. విద్యార్థులకు దంత సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు పూటలా బ్రష్ చేసుకోవడం, దంత వైద్యులను సంప్రదించడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చేయాలన్నారు. ఉషా డెంటల్ కేర్ హాస్పిటల్ డాక్టర్ ఉషారాణి విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాలయ కరస్పాండెంట్ అంబటి చక్రధరరావు, గురువుబిల్లి శ్రీధర్, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలో బట్టేరు గ్రామ పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో ఆలయాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వేసవి దుక్కితో.. భూసారం

- యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు
- లోతు దుక్కి వల్ల పంటలకు ఎంతో మేలు



ట్రాక్టర్‌తో వేసవి దుక్కి చేపడుతున్న రైతు

ఎచ్చెర్ల: రబీ సీజన్ ముగుస్తుండడంతో రైతులందరూ వచ్చే ఖరీఫ్‌కు ఏ పంట వేయాలి.. ఏ రకం విత్తనాలు చల్లుకోవాలి.. ఏయే ఎరువులు సిద్ధం చేసుకోవాలి.. పంటల సాగుకు నేలను ఎలా సిద్ధం చేసుకోవాలంటూ ఆలోచిస్తుంటారు. రానున్న ఖరీఫ్ కోసం ఇప్పటినుంచే వనరులను సిద్ధం చేసుకోవడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకునే వీలుంటుంది. వీటన్నికంటే ముందుగా ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండగానే.. లోతు దుక్కి చేయడం వల్ల పంటలకు ఎంతో మేలు కలుగుతుంది. వేసవిలో పాటించే యాజమాన్య చర్యలు ద్వారా ఖరీఫ్ పంట దిగుబడుల్లో మంచి ఫలితాలు ఉంటాయని వ్యవశాయశాఖ అధికారులు అంటున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వ్యవసాయ భూమి (ఎకరాల్లో) వివరాలు	
మండలం	వ్యవసాయ భూమి
ఎచ్చెర్ల	15,000
లావేరు	30,000
రణస్థలం	42,000
జి.సిగడాం	18,000

దుక్కి చేసే విధానం ఇలా..

రానున్న ఖరీఫ్‌లో వేసే పంట కోసం ఇప్పటి నుంచే సాధారణ కల్టివేటర్ (ట్రాక్టర్‌కు వాడే మామూలు నాగలి) బదులుగా లోతు దుక్కి దున్నడానికి రెక్క నాగలి, బల్లెపు నాగలి, గునపపు నాగలి వాడితే నేల 30 నుంచి 75 సెంటీ మీటర్లు లోతుకు దిగి ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది. వాలుకు అడ్డంగా దుక్కి చేయడం వల్ల భూమి కోతకు గురికాకుండా తేమ ఎక్కువగా పెరుగుతుంది. ప్రస్తుం పొలాలు ఖాళీగా ఉండడం వల్ల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగిపోతాయి. దీనివల్ల రానున్న పంటలకు కలుపు బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రతి పొలాన్ని దున్నాలి. మామూలు నాగలితో కంటే ప్రత్యేకంగా ఉన్న నాగళ్లను ఉపయోగించడం ద్వారా పొలంలో ఒక అడుగుకు పైగా లోతు దుక్కి చేయడానికి వీలు కలుగుతుంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో పత్తిసాగు చేసే భూమిని వేసవి దుక్కి చేయడం వల్ల పంటకు నష్టం కలిగించే ఎరువు, గులాబీ రంగు పురుగులు ఆదిలోనే నశించి.. రైతుకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

ట్రాక్టర్లతో లోతుగా దుక్కి చేయాలి

వేసవిలో ట్రాక్టర్ల ద్వారా లోతుగా దుక్కులు చేయడం పంట పొలాలకు ఎంతో మేలు. భూమి గుల్లబారుతుంది. వర్షంనీరు సమృద్ధిగా భూమిలో ఇంకి ఎక్కువ కాలం పంటలకు తేమను అందిస్తుంది. కలుపు నివారణ జరుగుతుంది.

– సురేష్, ఏఓ, ఎచ్చెర్ల

ఘనంగా నాటక రంగ దినోత్సవం



కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు



ఎచ్చెర్ల: వీరేశలింగం జీవిత విశేషాలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు గోవిందరావు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల కార్యాలయంలో సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగం 177వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్త్రీవిద్య, వితంతు వివాహాలు, బాల్య వివాహాలు, వరకట్నంపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చిన మహనీయుడు వీరేశలింగం అని కొనియాడారు. కార్యక్రమంలో పన్నాల నర్సింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, బి.రామచంద్రదేవ్, కంచరాన అప్పారావు, పొట్నూరు వేంకటరావు, ఇంజరాపు రమణారావు, సొంగల గణేష్, పైడి సత్యవతి, జ్యోతి, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త

ఎచ్చెర్ల: కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త, తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తని బుడుమూరు ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు తెలిపారు. కందుకూరి జయంతిని బుధవారం బుడుమూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

రణస్థలం: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని, జీతాలను 2016 నుంచి ఒక్క రూపాయి కూడా పెంచలేదని రణస్థలం మండల ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. 19 ఏళ్ల సర్వీసును గుర్తించాలని, గ్రామ పంచాయతీ ఉద్యోగిగా గుర్తించి తమ విధులను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, అంగన్‌వాడీలకు ఇచ్చినట్లు గ్రాట్యూటీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబ సభ్యునికి ఇచ్చి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. తమ విద్యార్హతలు ఆధారంగా పదోన్నతలు ఇవ్వాలని కోరారు. ఈ నెల 21న ఒక్కరోజు పనులు పూర్తిగా నిలిపివేసి పెన్ డౌన్ చేస్తామన్నారు. తదుపరి కార్యాచరణ నిమిత్తం ఈ నెల 28వ తేదీ నుంచి విధులను పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడతామన్నారు. ఈ వినతిపత్రం అందించిన వారిలో చుక్క రమణరెడ్డి, పి గడ్డెయ్య, ఎం.భాస్కరరావు, రాజేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ భృతి అందజేయాలని నిరసన

- సభ్యులు లేక వాయిదా పడిన మండల సమావేశం



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఎంపీటీసీలు

జి.సిగడాం: గౌరవ భృతి అందజేయాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీటీసీ సభ్యులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సభకు హాజరవ్వాలంటే ఎంపీటీసీలకు గౌరవ భృతి చెల్లించాలన్నారు. విజయనగరం జిల్లాలో మాత్రం ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు ఇస్తున్నారని, తమకు మాత్రం ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇకనుంచి సమావేశాలకు, మండల తీర్మానాలకు తాము దూరంగా ఉంటామన్నారు. ఎంపీటీసీ సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, మీసాల సాద్వీమణి, పట్నాన శాంతి, బూరాడ శ్రీదేవి, కుదిరెళ్ల సూజాత, పరసరాపు మంగమ్మ, తిరుమరెడ్డి విజయలక్ష్మి, తదితరులు మండల సమావేశానికి హాజరుకాకుండా కార్యాలయం వద్ద నిరసన చేపట్టి వెనుదిరిగారు. 16 మంది ఎంపీటీసీలుంటే ఐదుగురు సభ్యులు సభ ప్రారంభం కాకముందే రికార్డుల్లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. సభ్యులు పూర్థిస్థాయిలో హాజరుకాకపోవడంతో సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే తప్పుడు కేసులు



నిరసన ప్రదర్శన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు తప్పుడు కేసులు పెడుతోందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఈడీతో తప్పుడు కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం శ్రీకాకుళంలోని నానుబాలవీధి వద్దనున్న ఇన్‌కం టాక్స్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈడీ, ఈసీ, ఇన్ కమ్ టాక్స్ వంటి సంస్థలను పావులుగా వాడుకొని తప్పుడు కేసులు బనాయించి ప్రతిపక్షాలను భయపెట్టాలి అనుకోవడం దురదృష్టకరమన్నారు. దీనికి తమ నాయకుడు రాహుల్ గాంధీ భయపడే ప్రసక్తే లేదన్నారు. రాహుల్ గాంధీ ఎదుగుదలను చూడలేక ఈడీని ఉసిగొల్పుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, ప్రధాన కార్యదర్శి సైదుల్లా ఖాన్, ఎచ్చెర్ల నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ఆబోతుల వెంకటనాయుడు, బి.సంజీవరావు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు అంబటి దాలినాయుడు, శోడవరం చంద్రరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గాదెకు శుభాకాంక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మూడోసారి ఎన్నికై, బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన గాదె శ్రీనివాసులనాయుడుకు పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, లెక్చరర్ల సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అన్ని యాజమాన్యాల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల సాధనే తన ధ్యేయమని ఎమ్మెల్సీ పేర్కొనడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు భైరి అప్పారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎల్.బాబూరావు, కార్యదర్శి దానేటి కేశవరావు, బి.మల్లేశ్వరరావు, బి.గోపీచంద్, సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



చక్రవర్తి

గార: మండల తహసీల్దార్‌గా ఎం.చక్రవర్తి బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈయన బదిలీపై మండలానికి వచ్చారు. గతేడాది డిసెంబర్ 31వ తేదీ నుంచి ఇన్‌చార్జి తహసీల్దార్ ఇక్కడ ఉన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నమెంట్

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా జరుగుతున్న ఫుట్‌బాల్ డే అండ్ నైట్ టోర్నమెంట్ ముగిసింది. రెండు రోజుల పాటు ఏడు జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ మంగళవారం రాత్రితో ముగిసింది. ఈ పోటీల్లో నరసన్నపేట జట్టు విజేతగా నిలిచింది. శ్రీకాకుళం రన్నరప్‌గా నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు స్వర్ణకార సంఘం అధ్యక్షుడు అనుపోజు కోటిబాబు, సర్ణకార సంఘం సేవా కార్యకర్త ఖండవిల్లి సిద్ధార్థ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎ.రిషిరాజ్, ఎం.సంతోష్, ఎ.తారక, జె.నారాయడు, పి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నేడు

శ్రీకాకుళం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

అభినందన..



పెన్‌కాట్ సిలాట్ పోటీల్లో రణస్థలం మండల కేంద్రానికి చెందిన డి.సుచరిత బ్రాంజ్ మెడల్ సాధించింది. క్రీడాకారిణిని జే.ఆర్.పురం సీఐ ఎం.అవతారం బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో గల బి.ఆర్.యాదవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజులపాటు అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాట్ సిలాట్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీపరశురామ యుద్ధ కళాక్షేత్రానికి చెందిన సుచరిత పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించినట్లు శిక్షకుడు లింగాల ఈశ్వరరావు తెలిపారు.

– రణస్థలం

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

- మృతుడి భార్యకు తీవ్రగాయాలు



రాములప్పడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

దెంకాడ: మండలంలోని చొల్లంగిపేట జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని ఎన్‌జీఆర్ పురం గ్రామానికి చెందిన జిగిలి రాములప్పడు(54) అక్కడికక్కడే మృతి చెందగా మృతుడి భార్య మహలక్ష్మి తీవ్ర గాయాలపాలైంది. దీనిపై ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాములప్పడు, భార్య మహలక్ష్మి తమ కుమార్తె వివాహ విషయమై మాట్లాడేందుకు విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి వెళ్తున్నారు. కుమిలి-విజయనగరం రోడ్డులోని చొల్లంగిపేట జంక్షన్‌కు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడిపోయింది. దీంతో బైక్ నడుపుతున్న రాములప్పడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, బైక్ వెనుక కూర్చున్న మహలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. మృతుడి సోదరుడు జిగిరి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం



పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఇంటి విషయాల్లో సమస్యలు వచ్చినపుడు యజమాని సమన్వయంతోనే పరిష్కారం సులభమవుతుందని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి జి.శోభారాణి అన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక కృష్ణా పార్క్ సెక్టార్ పరిధిలోని గాజుల వీధి, పండావీధి, చిత్తరాంజన్ వీధి, చౌకబజార్, చిన్న బజార్, పేర్ల పంజా అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ ఇంటి విషయాల్లో పురుషుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి రమణ మాదిగ, లక్ష్మి, ఎంఎస్‌కేలు రత్నకుమారి, సారీనా బేగం, ఐశ్వర్య, ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సరస్వతి, రోజా, పైడి లక్ష్మి, సరిత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే పోరాటం తప్పదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు అనంతరం హెల్త్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీకాకుళం నగరపాలక సంస్థతోపాటు రాష్ట్రంలోని అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పనిచేస్తున్నటువంటి పారిశుద్ధ్య కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. మరణించిన, విశ్రాంత కార్మికుల పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో జె.గురుమూర్తి, మణి, ఆర్.గణేష్, రామచంద్ర, అర్జీ గణేష్, రసూల్, కిరణ్, సోషల్ మీడియా ప్రతినిధులు అరుగుల రమణ, కె.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



లక్ష్మీగణపతికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో విజయ గణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు గణపతి ఆలయాల్లో సంకష్ట హర చతుర్థి పూజలు బుధవారం జరిగాయి. పాలకొండ రోడ్డులోని విజయ గణపతి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే మొండేటివీధిలోని లక్ష్మీగణపతి ఆలయంలో షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కలశాలతో మహిళలు



వేషధారణలో కళాకారులు

పట్టణంలోని పుణ్యపు వీధిలో ఉన్న సీతారామచంద్రమూర్తి సహిత సువత్సలాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులతో డే అండ్ నైట్ కూడలి నుంచి బయల్దేరి ఇలిసిపురం కూడలి మీదుగా రైతు బజారు నుంచి పుణ్యపు వీధి వరకు గ్రామ ప్రదక్షిణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్



ఊరేగింపులో స్వామివారు